ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

జీతం జానెడు.. పని బారెడు...

- అగమ్యగోచరంగా ఆర్‌పిల జీవితాలు
- సమస్యలపై ఆందోళన బాట
- నేడు కలెక్టరేట్ ఎదుట ఆర్‌పిలు, పొదుపు మహిళల ధర్నా

మెప్మాలో పనిచేసే రీసోర్స్ పర్సన్స్ (ఆర్‌పి)ల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. జీతం జానెడు.. పని బారెడు అన్నట్లుగా వారి పరిస్థితి తయారైంది. ఇప్పటికే తమ సమస్యలపై ఆర్‌పిలు ఆందోళన బాట పట్టారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నారు..

ధర్నా చేస్తున్న ఆర్‌పిలు, పొదుపు మహిళలు(ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ ప్రభుత్వ కార్యక్రమాలు జరిగిన అవి సక్సెస్ కావాలంటే పొదుపు గ్రూపుల సభ్యులు హాజరు కావాల్సిందే. రోజుకొక రూపాయ చొప్పున పొదుపు చేసుకొని ప్రారంభమైన పొదుపు సంఘాలు నేడు ఎలాంటి ష్యూరిటీ లేకుండా పొదుపు సంఘాల షూరిటీతో రూ.లక్షలాది రుణాలు తీసుకుంటూ తిరిగి చెల్లించుకుంటూ ఎదుగుతున్నారు. వీరి పొదుపు గ్రూపులను సక్రమంగా నిర్వహణ బాధ్యతలు చూసేందుకు ప్రభుత్వం కమ్యూనిటీ ఆర్గనైజర్(సిఒ)లను నియమించింది. సిఒలు పొదుపు సంఘాల సక్రమంగా నడిచే విధంగా చూస్తూ ప్రతినెల సమావేశాలు నిర్వహించుకొని పొదుపు, బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడం లాంటి పనులను పర్యవేక్షించడం చేస్తూ ఉంటారు. కర్నూల్ నగరంలో మొత్తం 8500 పొదుపు సంఘాలు ఉన్నాయి. స్లం లెవెల్ ఫెడరేషన్లు 363, టౌన్ లెవెల్ ఫెడరేషన్లు 5 పనిచేస్తున్నాయి. వీటితోపాటు 360 రీసోర్స్ పర్సన్లు కూడా పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.8 వేలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌ల తరఫున రూ.2వేలు, మొత్తం రూ.పది వేలు ప్రతినెల జీతం ఇస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలన్నీ పొదుపు మహిళలను భాగస్వాములను చేస్తున్నారు. ప్రతినెల రూ.పది వేలు ఇవ్వాల్సిన జీతం రూ.89 నుంచి రూ.7600 మించి పడటం లేదు. వీటికి తోడు రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయి. ఎవరి ప్రభుత్వంలో వారి మనుషులను ఆర్పీలుగా పెట్టుకుంటున్నారు. ఐదు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. రకరకాల యాప్‌లు పెట్టి ఉదయం ఆరు గంటల నుండి రాత్రి 11 గంటల వరకు పనులు చేయిస్తున్నారు.

జగనన్న మార్ట్ కథ అంతేనా..?

ఒక్కో సభ్యురాలి నుంచి రూ.150 చొప్పున వసూలు చేసి వైసిపి ప్రభుత్వంలో 2023 జూన్ 20న ప్రారంభించారు. అందులో వచ్చిన లాభాలను పొదుపు సంఘాల వారికే పంచుతామనడంతో సభ్యులు వాటాలను చెల్లించారు. స్త్రీ శక్తి, మదర్ తెరిసా, పుణ్యవతి, స్వరాజ్యం, టిల్‌రోజ్ అనే ఐదు పట్టణ సమాఖ్యలు కలిసి ఒక్కోటి రూ.10 లక్షల వాటాతో రూ.50 లక్షలు బ్యాంకు ఖాతా ప్రారంభించారు. అది కాక రూ.16 లక్షలు డిపాజిట్ చేయించారు. 44 వేల మంది పొదుపు మహిళలతో మహిళా మార్ట్ ప్రారంభించారు. మార్ట్‌లో ఆర్భాటం కోసం అవసరం లేకున్నా రూ.28 లక్షల ఖర్చు చేసి ఎసిలను ఏర్పాటు చేశారు. నెలకు రూ.6000 అద్దె ఇచ్చే విధంగా నిర్ణయించారు. లాభాలు వచ్చిన వాటిని పొదుపు గ్రూపు సభ్యులకే పంచి పెడుతుంటే ఆశపడ్డ పొదుపు గ్రూప్ సభ్యులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించారు. మార్ట్‌లో సరుకులు నాణ్యత లేకపోవడం ధరలు ఎక్కువగా ఉండటం చేత ఎవరు కొనడానికి ముందుకు రాలేదు. దీంతో మహిళ మార్ట్‌లో ప్రతి సభ్యురాలు రూ.500 సరుకులు కొనాలని ఒత్తిడి చేశారు. సరుకులను పక్కదారి పట్టించి చివరకు మహిళా మార్ట్‌ను మూసేశారు. కనీసం లాభాలు దేవుడెరుగు తాము కట్టిన వాటా ధనం అన్నా వెనక్కి ఇవ్వాలని కోరుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ అన్ని సమస్యలపై ఈ నవంబర్ 21 నుంచి ఆర్‌పిలు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టారు. ఈనెల ఒకటిన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నారు.

ఐదు నెలలుగా జీతాలు లేవు

సంసారాలు వదిలిపెట్టి రాత్రనక పగలనక పనిచేస్తున్నాం. ఐదునెలుగా జీతాలురావడం లేదు. కేవలం ఒక్కొక్కరి ఖాతాలో ప్రతి నెలా రూ.89 నుండి రూ.7600 వరకు మాత్రమే జమ అవుతున్నాయి. మరికొందరి ఖాతాల్లో అసలు జమకావడం లేదు. పొదుపు గ్రూపు మహిళల వద్ద మహిళా మార్ట్ కోసం వసూలు చేసిన రూ.150 వాటా ధనం ఇవ్వాలని పొదుపు గ్రూప్ సభ్యులు మాపై ఒత్తిడి చేస్తున్నారు. అధికారులు పెడ చెవిన పెడుతున్నారు.

- ఉమాదేవి, ఆర్‌పి, లక్ష్మీ నగర్.

అధికారుల వేధింపులు కూడా ఎక్కువే

ఆర్పీలకు ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మెసేజులు వస్తాయి. చూడకుంటే సిఒలు తిట్ల పురాణం మొదలు పెడతారు. సిఒల వేధింపులు ఎక్కువయ్యాయి. రాత్రి 9 అయినా పురమిత్ర యాప్ డౌన్లోడ్ చేసి స్క్రీన్ షాట్ తీసి అధికారులకు పెట్టాలని ఆదేశిస్తారు. ఆర్పిలు కష్టపడి పని చేస్తే క్రెడిట్ సిఒలు పొందుతున్నారు. పని మాది సన్మానం వారిది. పని ఎక్కువ వేతనం తక్కువ. సంసారాలు వదిలిపెట్టి రాత్రి 11 గంటల వరకు కూడా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- షబానా, ఆర్‌పి.

రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయి

గత ప్రభుత్వంలో గడప గడప కార్యక్రమంలో జై జనసేన అంటే రేణుక దేవి అనే ఆర్‌పిని తీసేశారు. ఆమె ప్రదేశంలో సబీరా భానును తీర్మానం చేసే తీసుకున్నారు. ఆమె మూడు సంవత్సరాలుగా జీతం లేకుండా పని చేసింది. రేణుకా దేవి రూ.11 లక్షలు ఫ్రాడ్ చేసినట్లు తెలిసింది. రేణుకా దేవి ఎస్‌హెచ్‌జి దగ్గర డబ్బులు తీసుకుని వాడుకుంది. ఇంకా బ్యాంకులో నాలుగు లక్షలు బాకీ ఉంది. ఇదేం న్యాయమని ప్రశ్నిస్తే ప్రభుత్వం మాదే అని చెబుతున్నారు. అధికారులు కూడా ఆమెకే మద్దతు ఇస్తున్నారు.

- సుజాత, ఆర్‌పి, ముజఫర్ నగర్.

న్యాయం చేసే విధంగా కృషి చేస్తాం

నేను కొత్తగా వచ్చాను. గతంలో జరిగిన విషయాలు నాకు పూర్తిగా తెలియదు. ఆర్పీల జీతాల విషయం, మహిళా మార్ట్ అవినీతి గురించి తెలుసుకొని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చేసే విధంగా కషి చేస్తాం. ఆర్పీలపై పని భారం కూడా తగ్గించేందుకు ఆలోచిస్తాం.

- శ్రీనివాసులు, మెప్మా పిడి.

'ఈగల్' సైకిల్ ర్యాలీ

-'డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో'

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఆంధ్రప్రదేశ్ 'ఈగల్' విభాగాధిపతి ఇన్‌స్పెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ ఆకె.రవికష్ణ పర్యవేక్షణలో 'ఫిట్ ఇండియా– సండే ఆన్ సైకిల్ ర్యాలీ' లో భాగంగా డ్రగ్స్ వద్దు బ్రో– సైకిల్ తొక్కు బ్రో' అనే నినాదంతో కర్నూలులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎపి రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టిజి. భరత్, పాణ్యం ఎమ్మెల్యే చరితా రెడ్డి, ఈగల్ ఎస్పినగేష్ బాబు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొండారెడ్డి బురుజు నుంచి ఎస్‌వి కాంప్లెక్స్ సర్కిల్, ఆర్‌ఎస్‌రోడ్డు, రాజ్ విహార్ మీదుగా డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసు కూడలి వరకు డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఈ ర్యాలి నిర్వహించారు. దాదాపు 400 మంది సైకిల్ తొక్కుతూ డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి టిజి. భరత్ మాట్లాడుతూ ... డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పనిచేస్తున్నారని తెలిపారు. కర్నూలు జిల్లాలో డ్రగ్స్ వినియోగం తక్కువగా ఉండడం సంతోషంగా ఉందని పూర్తిగా నిర్మూలిద్దామని చెప్పారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ.. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాల్సిన బాధ్యత ఉందని, డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో ప్రజలు భాగస్వామ్యములు కావాలని కోరారు. డ్రగ్స్ వల్ల జాతీయ సంపదకు నష్టం, యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, డ్రగ్స్ బారిన పడి యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈగల్ ఎస్పి నగేష్ బాబు మాట్లాడుతూ...డ్రగ్స్ అంతం కొరకై ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉంటూ డ్రగ్స్ నిర్మూలన క్రమంలో పోలీసు శాఖతో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే సందేశాన్ని గ్రహించి, పెద్ద ఎత్తున సమాజంలో ప్రచారం చేయాలని కోరారు. కర్నూలులోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో యువతకు, మహిళలకు అవగాహన కల్పించారు. కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్. గోవిందు రెడ్డి మాట్లాడుతూ... ఈగల్ టీంతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసేందుకు రెడ్ క్రాస్ సొసైటీ సిద్ధమౌతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండ్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పి హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పి కష్ణ మోహన్, ఈగల్ పోలీస్ అధికారులు, సిఐలు , ఆర్ఐలు ఎస్ఐలు, జిల్లా పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ వారి అధికారులు, సిబ్బంది, సెట్కూర్ సిఇఒ, సాయి స్పోర్ట్స్ యువత , ప్రజలు పెద్ద సంఖ్యలో డ్రగ్స్ వ్యతిరేకంగా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఎపిడికెఎస్ జిల్లా కార్యకవర్గం ఎన్నిక

-అధ్యక్ష కార్యదర్శులుగా గర్జి అంజి, కరుణాకర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం కర్నూలు జిల్లా 5వ జిల్లా మహాసభలు ఎమ్మిగనూరులో ఘనంగా నిర్వహించామని, ఈ సందర్భంగా 35 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి కరుణాకర్ తెలిపారు. ఆదివారం కార్మిక కర్షక భవన్ వద్ద ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. బి కరుణాకర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరులో శివ సర్కిల్ నుండి తేరుబజార్ లో ఉన్న పద్మశాలి కళ్యాణ మండపం వరకు డప్పుల మహాప్రదర్శన నిర్వహించి, అనంతరం మహాసభలను నిర్వహించామన్నారు. మహాసభలో నూతన జిల్లా అధ్యక్షులుగా గర్జి అంజి, జిల్లా కార్యదర్శిగా బి.కరుణాకర్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఓర్వకల్లు మద్దిలేటి, కౌతాళం మారయ్య, కోసిగి ముక్కురన్న, ఎమ్మిగనూరు తిమ్మన్న, పెద్దకడు బూరు డప్పురాజు, కోడుమూరు సుధాకర్, కర్నూలు వెంకటేశ్వర్లు, జిల్లా సహాయ కార్య దర్శులను ఎన్ను కున్నారు. 24 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పత్తికొండ ఆస్పరి మండలాల నుండి కో ఆప్షన్ పెట్టుకొన్నామని తెలిపారు.

గర్జి అంజి

బి.కరుణాకర్

పెంచలయ్యను హత్య చేసిన గుండాలను శిక్షించాలి

- ప్రజా సంఘాల నేతలు డిమాండ్ - కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నెల్లూరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్య పరుస్తున్న యువకళాకారుడు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి మత్తుమందు గుండాలను కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం సమీపంలో పెంచలయ్య హత్యను ఖండిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప, జెవివి జిల్లా అధ్యక్షుడు బీడీ సుధీర్, రాజు, జిల్లా సీనియర్ నాయకులు జంధ్యాల రఘుబాబు, సిఐటియు నగరనాయకులు టి.రాముడు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న పెంచలయ్య నెల్లూరు రూరల్‌లో ప్రజానాట్యమండలి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన గంజాయి సంస్కృతికి వ్యతిరేకంగా ఆయన ప్రజలను, యువతను చైతన్య పరచడానికి అనేక కళారూపాలను రూపొందించి ప్రదర్శించారన్నారు. పోలీస్ శాఖ సహకారంతో కూడా కొన్ని కార్యక్రమాలు చేశారన్నారు. దీంతో అక్కడి గంజాయి ముఠాకు ఏమాత్రం మింగుడు పడలేదన్నారు. ఆయన కదలికలపై నిఘా వేసిన ఆ ముఠా పకడ్బందీగా ఓ పథకం రూపొందించి ఆయనను హతమార్చిందన్నన్నారు. బడి ముగిసిన తరువాత ట్యూషన్‌కు వెళ్లిన తమ పిల్లలను తీసుకురావడానికి వెళ్లి పిల్లలతో ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో ముఖానికి ముసుగులతో ఉన్న ముగ్గురు నలుగురు వ్యక్తులు ఆయన వాహనానికి అడ్డుగా వెళ్లి, దాడి చేశారన్నారు. పెంచలయ్య పై దాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. **కర్నూలు క్రైం:** డ్రగ్స్ నిర్మూలనకు పోరాటం చేసిన నెల్లూరు డివైఎఫ్‌ఐ నాయకులు పెంచలయ్యను హత్య చేసిన డ్రగ్స్ మాఫియాను కఠినంగా శిక్షించాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాఘవేంద్ర అన్నారు. కర్నూలు మండలం, ఉల్చాల గ్రామంలో డివైఎఫ్‌ఐ గ్రామ కార్యదర్శి హరికిషన్‌రెడ్డి అధ్యక్షతన పెంచలయ్య హత్యను ఖండిస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడారు.

కర్నూలు కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

బెల్టు గ్రేడింగ్ పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

ఆత్మరక్షణ క్రీడల్లో రాణించాలి

- మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్ : ఆత్మరక్షణ క్రీడలు అయిన టైక్వాండో, బాక్సింగ్, జూడో వంటి క్రీడల్లో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా శిక్షణ పొందాలని మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఎన్. శమంతకమణి సూచించారు. కర్నూలు నగరంలోని కిడ్స్ వరల్డ్ పార్క్‌లో ఆదివారంఉచిత టైక్వాండో శిక్షణ కార్యక్రమంలో ఎల్లో, గ్రీన్ బెల్టులు సాధించిన విద్యార్థులకు ఎన్.శమంతకమణి బెల్టులు ప్రదానం చేవారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నగరంలో ఉచితంగా అందుతున్న ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ శిక్షణకు పంపి శ్రద్ధ వహించాలని, సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కొని సమయాన్ని మృథా చేయకుండా చదువులోనూ, క్రీడల్లోనూ రాణించాలని కోరారు. బెల్టులు సాధించిన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సాధన చేసేందుకు అవసరమైన పరికరాలను నగురూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ తరపున అందజేశారు. టైక్వాండో కోచ్ టి.వెంకటేశ్వర్లు, టి.అజయ్, బాక్సింగ్ కోచ్ ఆర్. మధుకుమార్, జూడో కోచ్ కె. నవీన్, జూనియర్ టైక్వాండో శిక్షకులు శ్రీలలిత, టి.తిలక్, అఖిల్, టి.సాయికృష్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

త్వరలో డిసిసి అధ్యక్షుడిని నియమిస్తాం

- ఎఐసిసి పరిశీలకులు హెచ్‌సి.యోగేష్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లాలో డిసిసి అధ్యక్షుడు నియామకం త్వరలోనే చేపడుతున్నట్లు ఎఐసిసి పరిశీలకులు హెచ్ సి యోగేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ షేక్ జిలాని బాష అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకుగాను నవంబర్ 25 నుండి క్షేత్రస్థాయిలో పర్యటన చేశామన్నారు. ఈ పర్యటనలో భాగంగా క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించామన్నారు. యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఎంనాగ మధు యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, మాజీ డిసిసి అధ్యక్షులు కె.బాబురావు. నియోజకవర్గం కోఆర్డినేటర్లు ఎం కాసిం వలి, బి.క్రాంతి నాయుడు, అనంతరత్నం మాదిగ, ఐఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బి.మహేంద్ర నాయుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రాచీన కళలను కాపాడాలి

- ఆర్‌యు, క్లస్టర్ విశ్వవిద్యాలయాల విసి వెంకటబసవరావు

- అబ్బుర పరిచిన తోలుబొమ్మలాట

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తోలుబొమ్మలాంటి ప్రాచీన కళలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాయలసీమ, క్లస్టర్ విశ్వవిద్యాలయాల ఉపకులపతి వి.వెంకటబసవరావు అన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్య అధ్యయన సంస్థ బిఇడి కళాశాలలో ఆదివారం కీర్తిశేషులు దండె బోయినబాల రంగయ్య, పాపులమ్మల స్మారక పురస్కార ప్రదానోత్సవంలో తోలుబొమ్మలాటల ప్రదర్శన అత్యద్భుతంగా ప్రదర్శించారు. సాహితీ సదస్సు, నరసం, ప్రభుత్వ బిఇడి కళాశాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ దండె బోయిన పార్వతీదేవి ,లక్ష్మయ్య తన తల్లిదండ్రుల పేరు మీద జానపద కళాకారులకు ప్రతిఏటా పురస్కార ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం తోలుబొమ్మలాట ప్రదర్శన సింధే రామ్మూర్తి బృందం లేపాక్షి వారిని ఆహ్వానించి పురస్కారం ప్రదానం చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన సదస్సుకు సభాధ్యక్షులుగా డాక్టర్ ఆదినారాయణ రెడ్డి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా రాయలసీమ, క్లస్టర్ విశ్వవిద్యాలయాల ఉపకులపతి ఆచార్య వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ హాజరయ్యారు. ఉపకులపతి మాట్లాడుతూ మన ప్రాచీన కళారూపమైన తోలుబొమ్మలాట ఎంతో విశిష్టమైనదని,దీనిరి 500 యేళ్ల చరిత్ర ఉందన్నారు. అది కర్నూలు బిఇడి కళాశాలలో ప్రదర్శించబడటం చాలా సంతోషకరమని అన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షులు కురాడి చంద్రశేఖరకల్కురా, జెఎస్ఆర్‌కెశర్మ మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవించడం గురువులను ఆదర్శంగా తీసుకోవడం ఈ తరం పిల్లలకు నేర్పాలన్నారు. అమ్మానాన్నలపై వచ్చిన పద్యాలను జెఎస్‌ఆర్‌కె శర్మ చదివి వినిపించారు. జానపద కళారూపాలు మన విజ్ఞానానికి వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఇలాంటి కళలను ప్రోత్సహించాలని అన్నారు. రాయలసీమలోని కళల పట్ల ఉన్న ఆదరణను జి శ్రీనివాస్ సభ అధ్యక్షులు డాక్టర్ ఆదినారాయణ రెడ్డి ప్రస్తావించారు. వారు మాడుతూ మరిచిపోతున్నా మన జానపద కళారూపాలను రక్షించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. త్రిడి, కార్టూన్ చిత్రాలకు ముందుతోలుబొమ్మలాట ఉందన్నారు. అమ్మా నాన్నలను స్మరించుకుంటూ ఇటువంటి మంచి కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. రామాయణం లోని సుందరకాండ ఘట్టాన్ని చాలా అద్భుతంగా లేపాక్షి రామ్మూర్తి బృందం తోలుబొమ్మలతో ప్రదర్శన అందరిని విశేషంగా ఆకట్టుకుందని లలితకళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య అన్నారు. డాక్టర్ మధుసూదన్ ,డాక్టర్ గోవిందరాజులు డాక్టర్ వేణుగోపాల్ , డాక్టర్ కళ్యాణ్ మనోహర్ , సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ డాక్టర్ దండెబోయిన పార్వతిదేవి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం జానపద కళలను ప్రోత్సహించడంతోపాటు అందరిని చైతన్య పరచడం గొప్పవిషయమన్నారు. డాక్టర్ దండెబోయిన పార్వతిదేవి మాట్లాడుతూ మానాన్న టీచరుగా, వైద్యుడిగా, సామాజిక కార్యకర్తగా చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. తోలుబొమ్మలాట నిర్వహకులు సింధే రామ్మూర్తి , సావిత్రమ్మ, మారుతీ రావు బాలాజీ, ఉమలకు ఘనంగా సత్కరించారు. మహ్మద్‌మియ్యా అభ్యుదయ గీతాలాపనలు అందరినీ ఆలోచింపజేశాయి. అంతకు ముందు చిన్నారుల నృత్య ప్రదర్శన , కర్ణాటి చంద్రమౌళిని కర్నూలు గేయం సభికులను ఆకట్టుకున్నాయి.

మాట్లాడుతున్న ఆర్‌యు, క్లస్టర్ విశ్వవిద్యాలయాల విసి వెంకటబసవరావు

తోలుబొమ్మలాట సింధేరామ్మూర్తికి పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణకు స్పెషల్ డ్రైవ్ : కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం విడుదల చేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్, అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్‌ఆర్‌ఎస్–2020 పొడిగింపు పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కలిగించేందుకు పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరగాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. అనధికార నిర్మాణాలను, లేఅవుట్లను గుర్తించి నోటిసులు జారీ వేగవంతం చేయాలని సూచించారు. సోమవారం నుంచి ప్రతి సచివాలయ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలి. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆదివారం పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులతో కమిషనర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. నగర అభివృద్ధి, ప్రజలభద్రత, చట్టబద్ధత కోసం ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాలు ద్వారా నగర ప్రజలు తమ గృహాలు, భూములకు పూర్తి చట్టబద్ధతను పొందే అవకాశం కలుగుతోందని, బీపీఎస్–2025 ద్వారా అనుమతి లేకుండా కట్టిన బిల్డింగ్స్ లేదా డివియేషన్ ఉన్న నిర్మాణాలను ఒకేసారి రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. 01–01–1985 నుండి 31–08–2025 మధ్య నిర్మితమైన బిల్డింగ్స్ అర్హులని, కానీ ప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, నది–వాగు–సాగర ప్రాంతాలు, మాస్టర్ ప్లాన్‌లో రోడ్/ఓపెన్ స్పేస్‌గా ఉన్న భూములు, 31–08–2025 తర్వాత కట్టిన నిర్మాణాలు, సెట్‌బ్యాక్‌లు ఉల్లంఘించిన భవనాలు అర్హులు కాదని తెలిపారు. అప్లికేషన్ సమయంలో రూ.10,000 ముందస్తు చెల్లింపు అవసరమని, పాత భవనాలకు 25శాతం తగ్గింపు, స్లమ్ ప్రాంతాలకు 50శాతం తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి సంబంధించి 30–06–2025 లోపు ఉన్న అనధికార లేఅవుట్లు, ప్లాట్లకు మాత్రమే క్రమబద్ధీకరణ అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా ప్లాట్‌కు చట్టబద్ధత, రుణసదుపాయం, భవిష్యత్ అభివద్ధి పనుల ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొన్నారు. రెండు పథకాలకూ సంబంధించి ప్రజలు గడువు ముగియక ముందే తప్పనిసరిగా దరఖాస్తులు సమర్పించాలని, ఇది ప్రభుత్వం ఇచ్చిన తుది అవకాశం అని స్పష్టం చేశారు.

అల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో సిఐటియు అఖిల భారత ప్రతినిధుల మహాసభలు ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరుగుతున్నాయని, 4న లక్షలాది మంది కార్మిక వర్గంతో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ బహిరంగ సభకు ఆశ, అంగన్వాడి ,ఆటో, హమాలి, భవన నిర్మాణ కార్మికులు ఇతర కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు , శ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పి.నిర్మల కోరారు. ఆదివారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులుపిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై వివిధ సెక్షన్‌లు కార్మిక చట్టాల మార్పులు చేస్తూ ముప్పెట దాడి చేస్తూన్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను వేగవంతం ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ప్రభుత్వం అనేక ప్రయత్నం చేస్తున్నదని, సిఐటియు ఎప్పటికప్పుడు వాటిని అడ్డుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గంపై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఆలిండియా మహాసభలో చర్చించి భవిష్యత్తు ఆందోళనలు నిర్వహిస్తున్నారని, ఈ మహాసభల జయ ప్రధానిపై కార్మిక వర్గం నుంచి పెద్ద ఎత్తున నిధులు సమకూర్చాలని, ఈనెల 4న జరిగే బహిరంగ సభకు వేలాది మందిని విశాఖకు తరలించాలని కోరారు. ఈ వర్క్ షాప్ లో సిఐటియు జిల్లా నాయకులు బి. రామాంజనేయులు, ఎం. గోపాల్, ఉమా,కోటేశ్వరరావు, కె.ప్రభాకర్,విజయ్, నరసింహులు, తిమ్మప్ప, జిల్లా నాయకులునగేష్, మహమూద్, గఫూర్, మోహన్, రేణుకమ్మ, బాలదర్గమ్మ, రుద్రమ్మ, రాముడు, మధు, జయ చంద్ర, అన్ని రంగాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అంజిబాబు

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ స్మారక పాఠశాలలో నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్షిప్ మోడల్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పరీక్షను కర్నూలు డిప్యూటీ డిఇఒ శ్రీధర్ బాబు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలో విద్యార్థులు అనుసరించాల్సిన మెలకువలను, వివిధ పాఠశాలలకు చెందిన సబ్జెక్టు నిపుణులు హెచ్. హరగోపాల్, పి.హిమకుమార్, ఆర్.కృష్ణ మోహన్, ఆర్.లక్ష్మీ నరసయ్య తదితరులు పాల్గొని విద్యార్థులకు పరీక్షలో అనుసరించవలసిన విధానాల గురించి వివరించారు. మొత్తం 208 మంది పరీక్షలో పాల్గొన్నారు.

డ్రగ్స్,గంజాయి ముఠాను అరెస్టు చేయాలి

-పెంచలయ్యను హంతకులను శిక్షించాలి-సిపిఎం, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

పెంచలయ్యను హతమార్చిన గంజాయి ముఠా వాళ్లని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, సిపిఎం పట్టణ నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకుడిని హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పెంచలయ్య ఆ ప్రాంతంలో యువకులకు గంజాయి అందకుండా మత్తు పదార్థాలకు బానిసవ్వకుండా గంజాయి ముఠా పై పోరాటం చేశాడని వారు తెలిపారు. దీనిని మనసులో పెట్టుకొని కక్షపూరితంగా గంజాయి ముఠా ఓర్వలేనితనంతో ఎలా అయినా సరే పెంచలయ్యను హతమార్చాలని కక్షతో దారిలో కాపు కాచి దాడి చేసి చంపారన్నారు. నెల్లూరులో డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య ను హతమార్చిన గంజాయి ముఠాను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య, కాలప్ప, తిమ్మన్న, అంథోని, రాకేష్, రవి రాజ్ , రమేష్, నాగరాజు, సల్మాన్, రాముడు పాల్గొన్నారు.

దేవనకొండ : పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ముఠా అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శించారు. గంజాయి ముఠా పోలీసులపై దాడులకు తెగబడే స్థాయికి వెళ్లిందంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. డ్రగ్స్ గంజాయిపైన డివైఎఫ్ఐ పోరాటం కొనసాగుతుందని, దాడులకు భయపడేది లేదని, భవిష్యత్తులో వీటిపై మరింత తీవ్రస్థాయిలో పోరాటాలు సాగిస్తామన్నారు. డ్రగ్స్ అంతం డివైఎఫ్ఐ పంతంగా రాష్ట్ర వ్యాప్త కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. మండల నాయకులు రాయుడు, వీరేంద్ర, కెబి నాగేంద్ర, అనీల్ కుమార్, తేర్నేకల్ జి నాగేంద్ర పేర్కొన్నారు.

ఆదోని రూరల్ : డివైఎఫ్ఐ నాయకుడిని హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ చిరంజీవి

ఎమ్మిగనూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం , ప్రజాసంఘాల నాయకులు

డిమాండ్ చేశారు. ఆదోని మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శ్రీకృష్ణ మాట్లాడుతూ యువకులను మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. గంజాయి ముఠా పెంచలయ్యను కాపుకాచి హత్య చేయడం దారుణమన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం డివైఎఫ్ఎ పోరాటం కొనసాగుతుందని, దాడులకు భయపడేది లేదన్నారు. డివైఎఫ్ఐ మండల నాయకులు చిరంజీవి, రమేష్, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు : నెల్లూరు జిల్లాలో డివైఎఫ్ఐ నాయకుడు పెంచలయ్యను హతమార్చిన గంజాయి ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. డివైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షుడు గోవర్ధన్ మాట్లాడుతూ నెల్లూరులో డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య తను నివాసం ఉండే ప్రాంతంలో యువకులను మత్తు పదార్థాలకు బానిసలుగా చేస్తూ గంజాయి విక్రయిస్తున్న ముఠాను అడ్డుకునేందుకు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ ప్రాంతంలో యువకులకు గంజాయి అందకుండా మత్తు పదార్థాలకు బానిసవ్వకుండా గంజాయి ముఠా పై పోరాటం చేశాడని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని గంజాయి ముఠా కక్షపూరితంగా పెంచలయ్యను కాపు కాచి తన పిల్లల ఎదుటనే అతి కిరాతకంగా హతమార్చారన్నారు. ఈ ఘటనని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. డివైఎఫ్ఐ నాయకులు ఉల్లిగప్ప, నారాయణ, శివ, రంజిత్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఉమేష్, సిఐటియు నాయకులు నారాయణస్వామి, కృష్ణ మద్దతు ఇచ్చారు.

ఆదోని రూరల్‌లో నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు, కర్నూలు మండలం ఉల్చాలలో నిరసన, ఆలూరు మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు

జిల్లా కోసం ఉద్యమం తీవ్రతరం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధి కావాలంటే జిల్లా సాధనతోనే అవుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తెలిపారు. ఆదోని జిల్లాగా ప్రకటించాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 15వ రోజుకు చేరాయి. మున్సిపల్ చైర్ పర్సన్ లోకేశ్వరి నారీమణులు మంజుల జిలేఖ శ్రీలక్ష్మి శ్రీదేవి రేణుక సౌమ్య వై లక్ష్మి అన్నపూర్ణమ్మ సుగుణమ్మ కూర్చున్నారు. మహిళామణులు చేపట్టిన దీక్ష శిబిరానికి ఏపీ జంగమహేశ్వర సంక్షేమ సంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రయ్య కార్యవర్గం శివకుమార్ మల్లికార్జున చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్న సమయంలోనే మున్సిపాలిటీగా ఆదోని అవతరించిందన్నారు. అలాంటి ఆదోని కాలానుగుణంగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. జిల్లా సాధనతోనే ఆదోని సంపూర్ణ అభివృద్ధి చెందుతుందని, తమ వంతు సహకారం ఉంటుందన్నారు. జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రయ్య మాట్లాడుతూ జిల్లా సాధన కోసం మహిళలు ముందుకు వచ్చి దీక్షకుపూనుకోవడం అభినందనీయమన్నారు. గతంలో రెండో ముంబైగా పేరున్న ఆదోని ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. మిల్లులు ఫ్యాక్టరీలు, మూతపడటంతో ఉపాధి కరువైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఆదోని జిల్లాగా ఏర్పాటు చేసి ఇక్కడ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. ఆదోని జిల్లా ఉద్యమంలో తమ వంతు సహకారం ఉంటుందని జిల్లా సాధన కమిటీ సభ్యులు లలిత కృష్ణమూర్తి గౌడ్ తెలిపారు.

జిల్లా సాధన దీక్షకు సంగమేశ్వర సంక్షేమ సంఘం సంఘీభావం

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఆదోని త్రీటౌన్ సిఐ రామలింగయ్య విద్యార్థులకు సూచించారు. ఆదోని పట్టణంలోనే నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఎజిఎం రమేష్ కుమార్ ఆదోని డివిజనల్ స్పోర్ట్స్ సెలక్షన్ కో-ఆర్డినేటర్ జి. రామన్న హాజరై ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూ.. చదువు తప్పా ఇతర కార్యకలాపాల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయకుండా

నిర్బంధిస్తే మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. స్కూలు యాజమాన్యం ప్రత్యేక చొరవతో ఇలాంటి క్రీడలు నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జోనల్ కో-ఆర్డినేటర్ ప్రియాంక, జెడ్‌సి జైబా మాట్లాడారు. బాల్యం దశ నుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఎజిఎం రమేష్ కుమార్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ జి. రమన్న, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీలు విదార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు.

ప్రమాదపు అంచున అల్లారుదిన్నె బ్రిడ్జి

-బ్రిడ్జి రోడ్డు పై పడిన గుంతలు
-రోజు వందలాది వాహనాలు రాకపోకలు
-సంఘటన జరిగితే ఘోర ప్రమాదమే

ప్రజాశక్తి - ఆస్పరి

దశాబ్దాల క్రితం నిర్మించిన అల్లారుదిన్నె బ్రిడ్జి ప్రమాదపు అంచుల్లో ఉంది. బ్రిడ్జిపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే బ్రిడ్జి ప్రమాదకరంగా మారినా ప్రజాప్రతినిధులలో, అధికారులలో చలనం లేకపోవడం పై ప్రయాణికులు మండిపడుతున్నారు.

బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి.. 1940లో బ్రిటీష్ వారు అల్లారుదిన్నె బ్రిడ్జి నిర్మించినట్లు వంతెనపై శిలాఫలకం కూడా ఉంది. బ్రిటిష్ కాలంలో రూ.1.25 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేశారు. అప్పటి నుంచి బ్రిడ్జి నిర్మాణం ఆలనా పాలన లేకపోవడంతో శిథిలావస్తులకు చేరింది.

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి.. బ్రిడ్జి రోడ్డుపై అక్కడక్కడ గుంతలు పడ్డాయి. సైడ్ వాలు కూడ కూలిపోయింది. ఎదురుగా ఒక వాహనం వస్తే మరొక వాహనం వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ఆస్పరి నుంచి వెళ్లేటప్పుడు బ్రిడ్జి ఆరంభంలోనే రెండు చోట్ల దెబ్బతింది. రోడ్డు గుంతలు పడి రోడ్డుకు ఉన్న ఇనుప కడ్డీలు వేలాడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గుంతలు పడిన చోట ప్రమాదకర చిహ్నం ఎర్రవస్త్రాన్ని ఉంచగా, మరోచోట అలాగే వదిలేశారు. గతంలో కూడా ఈ బ్రిడ్జి రోడ్డుపై గుంతలు పడితే ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి వదిలేశారు. నిత్యం ఈ రహదారి గుండా బళ్లారి, జిందాల్, కర్నూలు, నంద్యాల, హైదరాబాద్ ప్రాంతాలకు ఐరన్,సిమెంట్ 30 నుంచి 45 టన్నుల లోడుతో భారీ వాహనాలు, విద్యార్థి బస్సులు వెళుతుంటాయి. ఏమాత్రం రేప్పవాల్చిన భారీ మొత్తంలో నష్టం జరిగే అవకాశం ఉంది. ఆస్పరి నుండి కర్నూలుకు 80 కిలోమీటర్లు. ఈ బ్రిడ్జి కూలితే పత్తికొండ, దేవనకొండ మీదుగా కర్నూలుకు వెళ్లాలంటే 110 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బ్రిడ్జిని నిర్మించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గుంతలు పడిన అల్లారుదిన్నె బ్రిడ్జి

ఆర్ అండ్ బి అధికారులు మొద్దు నిద్ర వీడాలి

- రంగస్వామి,సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఆస్పరి.

బ్రిటీష్ కాలం నాటి అల్లారుదిన్నె బ్రిడ్జి శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేయకుండా ఆర్అండ్ బి అధికారులు మొద్దు నిద్ర పోతున్నారు. ప్రమాదాలు జరిగితే గాని స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఇదే బ్రిడ్జిపై ఎమ్మెల్యేలు, ఎంపీలు వెళ్తూ ఉంటారు. బ్రిడ్జిపై గుంతలు పడి కడ్డీలు వేలాడుతున్న పట్టించుకోక పోవడం ఏమిటని ప్రశ్నించారు.

బ్రిడ్జి పై గుంతలు పడిన రోడ్డును పూడ్చాలి

నబి రసూల్ ఆటో డ్రైవర్ ఆస్పరి

అల్లారుదిన్నె బ్రిడ్జి పై రోడ్డు గుంతలు పడి,కడ్డీలు వేలాడుతున్నాయి. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బ్రిడ్జిని దాటుతున్నాం. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలి.

ఉద్యమాల తోనే జిల్లా సాధన

ఉద్యమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని జిల్లా సాధనే లక్ష్యంగా నిర్వహించే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని న్యాయవాది రోటరీ క్లబ్ ఎగ్జిక్యూటివ్ ఎల్‌కె. జీవన్ సింగ్ కోరారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. మద్రాసు రాజధానిగా ఉన్న కాలంలోనే ఆదోని మున్సిపాలిటీగా అవతరించిందని, అలాంటి ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడానికి ప్రశ్నించకపోవడమే కారణమని అన్నారు. ఆదోని జిల్లా ఏర్పాటుపై పోరాటం దశాబ్దాల చరిత్రను దాటిందన్నారు. ఆదోని జిల్లా ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరి మనసులో ఉందన్నారు. అందరూ రోడ్డుపైకొచ్చి గళం ఎత్తక ముందే ప్రభుత్వం స్పందించి తక్షణం జిల్లాగా ప్రకటించాలన్నారు. ఇక్కడ ప్రజల డిమాండులో న్యాయం ఉందని, జిల్లా అవసరం ఉందన్నారు. ఈవాస్తవం అందరికీ తెలుసనేది ప్రశ్న మాత్రం ఇప్పటికీ నిలిచే ఉందన్నారు. ప్రజలు డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, ఈ నేపథ్యంలో కూడా ప్రజలు మేలుకోకపోతే సమస్య ఇలాగే మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత కర్నూలు జిల్లా విస్తీర్ణం, దూరం, పరిపాలనా ఒత్తిడి అన్ని ఆదోని ప్రాంత ప్రజలకు తీవ్ర సమస్యలను సృష్టిస్తున్నాయన్నారు. ఎమ్మిగానూరు, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం ప్రాంతాల ప్రజలు ఒక సాధారణ పనికే 100 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉందన్నారు. వృద్ధులకు, రైతులకు, విద్యార్థులకు, మహిళలకు ఇది నిత్యమైన వ్యధగానే మిగిలిందని అన్నారు. ఈ బాధను ప్రభుత్వం గుర్తించిందని, కానీ నిర్ణయం మాత్రం రాకపోవడం నిరాశ కలిగించిందన్నారు. రాజకీయ ప్రయోజనాలు, ఆలోచనలో స్పష్టత లేకపోవడం, పరిపాలనా నెమ్మదితనం అన్ని కలిసి ఈ నిర్ణయాన్ని సంవత్సరాల తరబడి వాయిదా పడుతూనే ఉందన్నారు. ఆదోని జిల్లా సాధన ఈ న్యాయమైన డిమాండ్ కోసం ఎంత ఒత్తిడి ఇస్తున్నారు ప్రస్తుతం స్పష్టత వస్తుందన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసినంతగా ఇక్కడ ప్రజలను మేలుకొలిపే వారు కూడా అంతంతా మాత్రమే ఉన్నారన్నారు. ర్యాలీలు, వినతిపత్రాలు, సమావేశాలు నిర్వహించడం వరకే పరిమితమయ్యా మన్నారు. ఈ మౌనాన్ని వ్యవస్థ అంగీకారంగా భావించిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం ఒక తప్పు అయితే, ప్రజలు నిరంతరం ఒత్తిడి చేయకపోవడం మరో పెద్ద తప్పు భావిస్తున్నామన్నారు. గొంతులు కలిస్తేనే ప్రభుత్వం కదులుతుందన్నారు. ఇప్పుడిప్పుడే ఆదోని జిల్లా సాధన ఉద్యమం రూపాంతరం విస్తరిస్తోందన్నారు. విద్యార్థులు రైతులు, వ్యాపారులు, యువత స్పష్టంగా ప్రశ్నిస్తున్నా పరిస్థితి కనపడుతుందన్నారు. 'ఆదోని వాణిజ్యంగా బలమైనప్పుడు, భౌగోళికంగా అనుకూలమైనప్పుడు, ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పుడు ఇంకా జిల్లా ఎందుకు రాలేదని అన్నారు. ఈ ప్రశ్న ప్రభుత్వానికే కాదు ప్రజాస్వామ్యానికి కూడా ఒక పరీక్ష అని వివరించారు. ప్రభుత్వంకన్నా ముందుగా ప్రజలు మేల్కొని స్పష్టమైన డిమాండ్‌ను ప్రాంతీయ ఏకతతో పోరాడాలన్నారు. ఆదోని జిల్లా ఏర్పాటు ఒక పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని ఇది ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాన్ని మార్చే చారిత్రక అడుగు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధి, విద్య, రవాణా, వాణిజ్యంల ను ప్రభావితం చేసే ప్రాంతీయ హక్కుగా తెలుసుకోవాలన్నారు. ఆదోని జిల్లా ప్రశ్న ఎవరి చేతుల్లో లేదని ప్రజల చేతుల్లో ఉందన్నారు. ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండల పరిధిలోని కలుగోట్ల గ్రామానికి చెందిన రైతు బోయ మద్దయ్య(55) ఆదివారం ఉదయం కురువ రాజు పొలం దగ్గర ఉన్న వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు రైతు మద్దయ్యకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంతోపాటు దేవుని మాన్యానికి చెందిన భూమిని కౌలు చేసుకుని జీవనం సాగించేవాడు. వ్యవసాయ పెట్టుబడుల కోసం సుమారు రూ. ఆరు లక్షలకు పైనే అప్పులు చేశాడు. ఈ సంవత్సరం మొక్కజొన్న పంట వేయడంతో సరైన దిగుబడి రాలేదు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

టిడిపిలో కొత్త నాయకుడు..!

- నీరాజనాలు పడుతున్న తెలుగు తమ్ముళ్లు
- ఆయన రాకని జీర్ణించుకోలేని సీనియర్లు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలంలో టిడిపిలో కొద్ది రోజులుగా కొత్త నాయకుడు తెరపైకొచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అన్నదాత సుఖీభవ, రైతన్న మీకోసం కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో మండల నాయకులు చేపడుతున్నారు. ఆయనకు ఎమ్మెల్యే రేంజ్‌లో మండలానికి సంబంధించిన కొంత మంది నాయకులు, కార్యకర్తలు నీరజనాలు పలుకుతున్నారు. గ్రామాల్లో పోటీపడి టిడిపి శ్రేణులు ఘన స్వాగతాలు, ఆహ్వానాలు, సన్మానాలు, ఆర్భాటాలు చేస్తున్నారు. ప్రజలు మాత్రం ఆయన్ను ఎప్పుడూ, ఎక్కడా చూడలేదని, ఆయన ఎవరంటూ చర్చించుకుంటున్నారు. ఆయన ఏమైనా ఎమ్మెల్యేనా.? మండల నాయకులా అంటూ టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎందుకంత హడావిడి చేస్తున్నారని ప్రత్యర్థి పార్టీ, వామపక్ష నాయకులు సెటైర్లు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సమయంలో కొన్ని పత్రికలు, మీడియాల్లో ఆయనపై వార్తలు వచ్చాయి. అప్పుడు టిడిపి నాయకులు ఆయన పార్టీకి సంబంధం లేదని బాహాటంగాపూ స్పందించారు. ఆయన రాకను సీనియర్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ పనులు కావాలన్నా, వ్యాపారాలు జరగాలన్నా, కార్యాలయాల్లో పనులు జరగాలన్నా ఆయన దగ్గరికి వెళితే అన్నీ సాఫీగా జరుగుతాయని టిడిపి నాయకులు బహిరంగనే చెబుతున్నారు.

సిసి రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో బిసి కాలనీలో రూ.10 లక్షల తో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు ఆదివారం గ్రామ ఎంపిటిసి బంగారు సునంద పటేల్ యాదవ్, గ్రామస్తులు భూపేష్, అశోక్, మోకా మల్లయ్య, ఈరన్న, చంద్రకాంత్ రెడ్డి, శ్రీరాములు, హనుమప్ప, విశ్వ, చంద్రలు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో సిసి రోడ్లు చాల వేశామని, ఇప్పటికే గ్రామంలో రూ.55లక్షలతో సిసి రోడ్లు వేశామన్నారను. కేవలం నెల రోజుల్లో రూ.36 లక్షలతో ఎంపిపి, ఉపాధి హామీ పథకం నిధులతో సిసి రోడ్లు వేసి టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతితో ప్రారంభోత్సవం చేశామని అన్నారు. గ్రామస్థుల సహకారంతో గ్రామంలో మరిన్ని సిసి రోడ్లు, డ్రెయినేజీలు వేస్తామని అన్నారు. గ్రామస్థులు సోమశేఖర్,సేకన్న, లింగన్న, వెంకటేష్, పూల రామాంజినేయులు, నాగప్ప, బాబు, డాక్టర్ వలి పాల్గొన్నారు.



వేసవిలో దాహాన్ని తీర్చే కుళాయిని పునరుద్ధరించాలి

తండ్రి భావి త్రవ్విస్తే కొడుకు పుడ్చినట్లు ంది

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్.

స్వాతంత్రానికి పూర్వం రాజాసర్ రామస్వామమి ముదలి యారు కర్నూలు నగరంలోని గడియారం ఆసుపత్రి ఎదురుగా వేసవిలో కార్మికుల అక్కడి ప్రజల దాహం తీర్చేందుకు కుళాయిని ఏర్పాటు చేశారు. ఆ కుళాయి అంత వరకు ప్రజల దాహార్తిని తీరుస్తూ వచ్చింది. అక్కడికి పల్లెల నుండి వచ్చే కార్మికులు, చుట్టుపక్కల ఉన్న చిరు వ్యాపారస్తులు ఈ కొళాయి ద్వారా వచ్చే నీటిని తీసుకుని తాగడానికి ,భోజనం చేసిన పాత్రలు కడుగుకోడానికి ఉపయోగించుకునేవారు. ఇటీవల సిపిఎం కార్యాలయం పక్కన కల్వర్టు నిర్మించే సమయంలో ఆ కుళాయికి ఉన్న కనెక్షన్‌ను కట్ చేశారు. దీనితో ఆ కళాయికి వచ్చే నీరు ఆగిపోయింది. ప్రతి ఇంటికి కొళాయి వేయించుకొని మున్సిపల్ కార్యాలయానికి పన్నులు కట్టాలనే ఉద్దేశంతో ఈ పని చేసినట్లు అనిపిస్తుంది. ఇది పాతకాలపు సామెత గుర్తువస్తుంది. తండ్రి భావి త్రవ్విస్తే కొడుకు పూడ్చినట్లు ఉంది. దీంతో అక్కడి ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రానున్న వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెంటనే మున్సిపల్ అధికారులు ఆ కొళాయికి కనెక్షన్ ఇవ్వాలని కార్మికులు ప్రజలకు కోరుతున్నారు.

కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరుతూ సచివాలయ అధికారులకు , మున్సిపల్ అధికారులకు వినతులు ఇచ్చాం. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శ వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరుతూ సిపిఎం పార్టీగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం స్పందించడం లేదు. అధికారుల స్పందించి వెంటనే కొళాయి కనెక్షన్ ఇవ్వాలి లేనిచో కార్మికులను, ఇక్కడి ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

స్మశాన వాటికలో అభివృద్ధిపనులు

ప్రజాశక్తి-వెల్దుర్తి : బొమ్మన, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కమ్యూనిటీకి సంబంధించిన స్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆదివారం భూమి పూజ చేపట్టారు. వర్షాకాలంలో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ఇబ్బందులు ఏర్పడకుండా ఉండటం కోసం 20 అడుగుల ఎత్తులో స్లాబ్, రెండు ఐరన్ బీడ్ పిల్లర్స్ తోపాటు, స్మశాన వాటికలో శివాలయం, చెట్ల పెంపకం, హస్తికలను భద్రపరిచేందుకు లాకర్ వసతి ఏర్పాట్లుచేస్తున్నట్లు వారు తెలిపారు. ఇందుకోసం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో రూ.20లక్షలతో నిధుల సేకరణ చేపట్టామన్నారు. మాజీ ఎంపిపి బొమ్మన దశరథరామిరెడ్డి, సముద్రాల శ్రీరాములు, తిరువీధి రమేష్, సాయిప్రసాద్, సముద్రాల సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 3లక్షలతో షెడ్ ఏర్పాటు

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ రూ. 3 లక్షలతో రేకులతో షెడ్ ఏర్పాటు చేసిన ధాత కుమారస్వామి దంపతులను ఆలయ సమీపంలో ఉన్న శ్రీ కొండాపురం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శాలువా, పూలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న వారు ఆంజనేయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామని కుమారస్వామి తెలిపారు. అలాగే వైసిపి నాయకులు జనార్దన్ రెడ్డికి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య, హొండే హానుమంతు, హొండే గోపాల్, బొంబాయి నరసింహ, హొండే నర్సింహులు, హొండే భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి-చిప్పగిరి

గ్రామ సచివాలయాలకు సంబంధించిన ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిప్పగిరి మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న నాకు ప్రమోషన్‌లో భాగంగా ప్రభుత్వం చిప్పగిరి మండల గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహించుటకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ సచివాల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వం ఏ సర్వేలు ఇచ్చిన సకాలంలో పూర్తి చేయుటకు గ్రామ సచివాలయాల అధికారులకు గైడ్‌లైన్స్ ఇచ్చి పూర్తి చేయుటకు కషి చేస్తామన్నారు. ముఖ్యంగా గ్రామ సచివాలయాలకు సకాలంలో సచివాలయ సిబ్బంది వచ్చేలా చూస్తామన్నారు.

రాజకీయంగా చైతన్యం కావాలి

ప్రజాశక్తి - ఆదోని రూరల్

జంగమ కులానికి తీరని అన్యాయం జరుగుతుందని, జంగమ కులస్తులు రాజకీయంగా చైతన్యం కావాలని రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం జెపి మల్లికార్జున స్వామి, కార్యదర్శి మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. ఆదోని పట్టణంలోని గణేష్ మినీ ఫంక్షన్ హాల్ రాష్ట్ర జంగమ మహేశ్వర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆదోని మున్సిపల్ కౌన్సిలర్ నాగరత్నమ్మ, రాష్ట్ర అధ్యక్షులు జేపీ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో జంగమ కులానికి తీరని అన్యాయం జరుగుతుందని, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. జంగమ కుల సర్టిఫికెట్లు దుర్వినియోగం అవుతున్నాయని, ఈ సర్టిఫికెట్లతోనే మిగతా కులాల వాళ్ళు డిఎస్‌సిలో ఉద్యోగాలు పొందారన్నారు. శ్రీశైలం ట్రస్ట్ బోర్డులో జంగములకు ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రభుత్వానికి బలం చూపించాల్సిన అవసరం ఉందన్నారు. జంగమ సామాజిక సభ్యులకు శ్రీశైలంలో శాశ్వతంగా ఒక ట్రస్ట్ బోర్డ్ పదవి ఇచ్చేలా ఆర్డినెన్స్‌కు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఆదోని జిల్లాకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు స్వామి నాగేశ్వరయ్య, రుద్రయ్య స్వామి, ఉపాధ్యక్షులు బసవరాజు స్వామి, జెపి నాగేశ్వరయ్య, మల్లికార్జున అయ్య, కర్నూల్ నగర కార్యదర్శి చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన స్పెషల్ మేజిస్ట్రేట్, నంద్యాల వారి కోర్టులో

C.C.No 361/2022

బండారు నాగేశ్వర రావు, వయస్సు 55సం॥లు,
S/o బి.నాగన్న, హిందూ, వ్యవసాయం, R/O H.No.8/3,
పరమతి వీధి రుద్రవరం గ్రామము & మండలము,
నంద్యాల జిల్లా, A.P. ...ఫిర్యాదుదారు

-V/S-

అంబటి జనార్దన్ రెడ్డి వయస్సు 60 సం॥లు,
S/o A.పెద్ద నాగి రెడ్డి, పంచాయతీ సెక్రటరీ,
R/o H.No.28/790, M.I.G, పంచాయతీ సెక్రటరీ,
కలుగొట్ల గ్రామము, వెల్దుర్తి మండల్, కర్నూల్ జిల్లా, A.P.
...ముద్దాయి

ముద్దాయి కు సమన్లు

పై ఫిర్యాదునందు ఫిర్యాదుదారు, ముద్దాయి అయిన మీ పై చెక్ బౌన్స్ కేసు దాఖలు చేసి ఉంది. పై ఫిర్యాదులో ముద్దాయి అయిన మీకు కోర్టు ద్వారా మరియు పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేది: 17-12-2025 న ఉదయం 10.30 గంటలకు హాజరై కుద్దున గాని వకీలు ద్వారా గాని మీ అక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించుదురని తెలియచేయడమయినది.

(కోర్టువారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేదీ : 17-12-2025

ఇట్లు
కె. హుస్సేన్ బాషా,
యస్. ఓబుల రెడ్డి,
ఫిర్యాదుదారు పరం అడ్వకెట్స్,
నంద్యాల
సెల్: 9440251292

IN THE COURT OF THE HON'BLE VII ADDL DIST. JUDGE :: KURNOOL:
E P.NO. 96/2025 IN A.A NO. 109/2024

Between:
M/s Shriram Finance Ltd,.
Represented by its GPA Holder.G.Murali
...Claimant/Decree Holder
And
1.V.Srinivasulu & another
...Respondents/Judgment Debtors

Mr.To
The JDr 1
1.V.Srinivasulu S/o V.Chinna Sunkanna
H.No. 5-35, H.Kottala, N.Konthalapadu Village
Orvakal Mandal, Kurnool Disttict. ...JDR'S

1, వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాధి Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1వ ప్రతివాదులైన (JDr.1) మీ పైనా ఆర్బిటేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule. 37, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 01-12-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు kurnool కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

తేది: 01.12.2025

B.CHANDRA SEKHAR
M.NARAYANA NAIK,
ADVOCAT FOR DHR KURNOOL